
సాక్షి ఆదిలాబాద్

శనివారం । 30 । ఆగస్టు । 2025



క్రీడాకారులే నిర్ణేతలుగా..
చిన్న వయస్సులో అథ్లెటిక్స్‌లో రాణించడమే కాకుండా స్టేట్ రెఫరీలుగా ఎంపికయ్యారు ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు. 8లో▸



గోదారమ్మ మహోగ్రరూపం
మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉగ్రరూపం దాల్చింది. బాసర వద్ద ఉప్పొంగి ప్రవహిస్తోంది. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30.0/24.0
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్ప పీడన ప్రభావంతో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

క్రీడలపై దృష్టి సారించాలి



జాతీయస్థాయి పతకాలు సాధించిన విద్యార్థులతో ఎంపీ, కలెక్టర్, డీవైఎస్‌వో

ఆదిలాబాద్: ప్రతి ఒక్కరూ క్రీడలపై దృష్టి సారించాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవంను ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి కలెక్టర్ రాజర్షిషాతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు బాల్యం నుంచే క్రీడలపై దృష్టి సారించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో క్రీడాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు.ఇందులోభాగంగా సెప్టెంబర్ 21 నుంచి డిసెంబర్ 25వరకు సంసద్ ఖేల్ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించి డిజిటల్ లాంచింగ్ చేపట్టారు. అనంతరం జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాపాఠశాల విద్యార్థులను సన్మానించారు. ఇందులో డీవైఎస్‌వో శ్రీనివాస్, పార్థసారథి, అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైద్య ఆరోగ్యశాఖకు చెందిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఆధార్ బేస్డ్ అటెండెన్స్ రద్దు చేయాలని, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి అందజేశారు. ఇందులో సంఘ బాధ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఆర్టీఏ చెక్‌పోస్టు సేవలు

కైలాస్‌నగర్: రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్టీఏ చెక్‌పోస్టు సేవలను వెబ్‌సైట్ www.transport.telangana.gov.in ద్వారా పొందవచ్చని కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. టెంపరరీ పర్మిట్, వాలంటరీ టాక్స్, స్పెషల్ పర్మిట్ వంటి సేవలను ఆన్‌లైన్‌లో పొందవచ్చని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కైలాస్‌నగర్: పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 1న చేపట్టనున్న పెన్షన్ విద్రోహ దినం జయప్రదం చేయాలని జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ సంద అశోక్, సెక్రటరీ జనరల్ కె.శివకుమార్ కోరారు. జేఏసీ సన్నాహక సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్‌తో కలెక్టరేట్ ప్రాంగణంలో చేపట్టే నిరసన కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులుపాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, జేఏసీ ప్రతినిధులు నవీన్‌యాదవ్, లక్ష్మారెడ్డి, సప్దార్ అలీ, విజయ్‌కుమార్, అశోక్, దిలీప్, ప్రవీణ్ కుమార్,అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతిష్టంభన



భారీ వర్షాల నేపథ్యంలో గడిచిన బుధవారం రాత్రి తాంసి మండలం ఈదుల్ సావర్గాం గ్రామం వద్ద 33కేవీ విద్యుత్ లైన్‌పై భారీ వృక్షాలు పడడంతో తీగలు తెగిపడ్డాయి. 17 స్తంభాలు నేల వాలాయి. దీంతో ఆ గ్రామంతో పాటు భీంపూర్ మండలానికి ఆ రాత్రి నుంచి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కాంట్రాక్టర్లు పనులకు దూరంగా ఉండడంతో విద్యుత్ శాఖ సిబ్బంది రంగంలోకి దిగినా వెంటనే సమస్యను పరిష్కరించలేక పోయారు. దీంతో ఆ మండలానికి 24 గంటల పాటు కరెంటు నిలిచిపోయింది. అధికారులు, సిబ్బంది అపసోపాలు పడి గురువారం రాత్రి 7 గంటలకు కరెంట్ సరఫరా పునరుద్ధరించగలిగారు. ఇక ఈదుల్‌సావర్గాం గ్రామానికి శుక్రవారం వరకు పునరుద్ధరణ పూర్తి చేయలేకపోయారు. దీంతో ఆ గ్రామస్తులు అంధకారంలో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.



ఈదుల్‌సావర్గాంలో వంగిపోయిన విద్యుత్ స్తంభం

- విద్యుత్‌శాఖలో వెనక్కి తగ్గని కాంట్రాక్టర్లు
- అత్యవసర పనులపై తీవ్ర ప్రభావం
- ప్రజలకు తప్పని కరెంట్ తిప్పలు
- ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు

సాక్షి,ఆదిలాబాద్: విద్యుత్ శాఖలో ప్రతిష్టంభన కొనసాగుతుంది. అకౌంట్ సెక్షన్‌లోని ఓ అధికారిని బదిలీ చేయాలని డిమాండ్‌తో గుర్తింపు పొందిన కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలుచోట్ల వృక్షాలు విద్యుత్ స్తంభాలు, తీగలపై పడుతుండడంతో పలు గ్రామాలకు కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కాంట్రాక్టర్ల వద్ద మిషనరీలు ఉండడంతో పనులు చకచకా చేపట్టే పరిస్థితి ఉంటుంది. అయితే తమ బిల్లులను పెండింగ్‌లో పెడుతున్నారని, ఓ అకౌంట్ సెక్షన్ అధికారి తీరును నిరసిస్తూ జిల్లాలో కొద్ది రోజులుగా వారు పనులకు దూరంగా ఉంటున్నారు. ఈ ప్రభావం క్షేత్రస్థాయిలో తీవ్రంగా కనిపిస్తోంది. విద్యుత్ శాఖ సిబ్బంది వద్ద మిషనరీ, లేబర్ సరిపడా లేకపోవడంతో ఆయా పనుల్లో తీవ్ర జాప్యం అవుతోంది. ఇందుకు భీంపూర్ మండలమే నిదర్శనం. ఏకంగా బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు ఈ మండలానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇది కేవలం ఒక్క మండలానికే పరిమితం కాదు. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని పలుచోట్ల కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దాన్ని అప్పటికప్పుడు పరిష్కరించడంలో ఆ శాఖ సిబ్బంది విఫలమవుతున్నారు. ఇటు కాంట్రాక్టర్ల సమస్య పరిష్కరించకపోవడం, క్షేత్రస్థాయిలో అత్యవసరంగా ఏర్పడుతున్న మరమ్మతు పనుల్లో జాప్యం నేపథ్యంలో ఆ శాఖపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే ఇటీవల కాంట్రాక్టర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కాగా ఈ విషయంలో కలెక్టర్ రాజర్షిషా విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్‌తో మాట్లాడినట్లు తెలుస్తోంది. అత్యవసర పనులు పూర్తి చేసే విషయంలో చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం. కాగా రెండు రోజుల క్రితం ఎస్ఈ కాంట్రాక్టర్లతో చర్చలు జరిపినప్పటికీ అవి ఫలప్రదం కాలేదు. దీంతో ఈ ప్రతిష్టంభన కొనసాగుతుంది. జిల్లాలో విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

సీఎండీ దృష్టికి..



ఎంపీ నగేశ్‌కు వినతిపత్రం అందజేస్తూ..

జిల్లాలో ఓ అధికారి తీరు నిరసిస్తూ కాంట్రాక్టర్లు అత్యవసర పనులు సైతం పక్కనబెట్టడం, క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో సమస్య జఠిలంగా మారుతుంది. కాగా శుక్రవారం కాంట్రాక్టర్లు ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్‌ను కలిశారు. సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ వెంటనే వరంగల్ సీఎండీ వరుణ్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. సీఎండీ ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, పరిశీలన జరుపుతున్నట్లుగా ఎంపీకి వివరించినట్లు కాంట్రాక్టర్లు తెలిపారు.

కాంట్రాక్టర్లకు నోటీసులు..



అత్యవసర పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లను కోరాం. స్పందించని వారికి సబ్ డివిజన్ వారీగా నోటీసులు ఇవ్వబోతున్నాం. అత్యవసర పనులు ఆపడానికి వీలు లేదు. వినియోగదారులకు విద్యుత్ పరంగా ఏర్పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కాంట్రాక్టర్లు ముందుకు రావాలి. వారి డిమాండ్ విషయంలో ఇప్పటికే చర్చలు జరిపాం. పరిశీలన చేస్తున్నాం. – జేఆర్ చౌహాన్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

జీపీ బిల్లులపై ఆరా

- తాంసి మండలంలోని ఈదుల్లాసావర్‌గాం పంచాయతీ 2018లో కొత్తగా ఏర్పడింది. ఆ వెంటనే అప్పటి సర్పంచ్ రూ.5లక్షల వ్యయంతో గ్రామంలో షెడ్డు నిర్మించాడు. అందుకు సంబంధించిన రూ.2లక్షల బిల్లు విడుదల కాగా, మరో మూడు లక్షలను ప్రభుత్వం మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంచింది. పదవీకాలం ముగిసి ఏడాదిన్నర కావస్తున్నా విడుదల చేయలేదు.
- మేజర్ గ్రామ పంచాయతీ అయిన బేల మండల కేంద్రంలో అప్పటి సర్పంచ్ రూ.20లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టాడు. వీటికి సంబంధించి రూ.8లక్షల బిల్లులు ఇంకా విడుదల కావాల్సి ఉంది. వాటి కోసం రెండున్నరేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. వీరిద్దరే కాదు.. జిల్లాలోని దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లోనూ అదే పరిస్థితి.

- వివరాలు పంపాలని ప్రభుత్వం ఆదేశం
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రాధాన్యత
- 'పెండింగ్' విడుదలపై మాజీ సర్పంచ్‌ల్లో ఆశలు



మావల గ్రామ పంచాయతీ కార్యాలయం

కైలాస్‌నగర్: సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి దాదాపు ఏడాదిన్నర కావస్తోంది. ఇప్పటికీ వారు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు విడుదల కావడం లేదు. మూడేళ్లకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలు పంపించాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించడంతో మాజీ సర్పంచ్‌ల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మూడేళ్లుగా నిలిచిన బిల్లులు ..

జిల్లాలో 473 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో మాజీ సర్పంచ్‌లు తమ హయాంలో ఎస్‌డీఎఫ్, సీడీపీ, పంచాయతీ జనరల్ ఫండ్‌తో గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, సవారీ బంగ్లా షెడ్లు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవన నిర్మాణాలు వంటి పనులు చేపట్టారు. ఇందులో జనరల్ ఫండ్ కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను సర్పంచ్‌లు పదవీ కాలం ముగిసే సమయంలో డ్రా చేసుకున్నారు. అయితే పాలన గడువు చివరలో సమర్పించిన బిల్లులతో పాటు వివిధ నిధులతో చేపట్టిన పనుల బిల్లులు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో పలుకుబడి ఉపయోగించి కొంత మంది సర్పంచ్‌లు డ్రా చేసుకున్నప్పటికీ అధికారికంగా మాత్రం మూడేళ్లుగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో ఆయా నిధులతో పనులు చేపట్టిన వారు ట్రెజరీ, జిల్లా పంచాయతీ, జెడ్పీ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

రూ.5.30 కోట్లు పెండింగ్‌లో..

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతుంది. సెప్టెంబర్‌లో ఎప్పుడైనా పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ రావచ్చనే చర్చ సాగుతుంది. ఈ నేపథ్యంలో బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉంటే మాజీ సర్పంచ్‌ల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశమున్నట్లుగా ప్రభుత్వం గుర్తించినట్లు తెలుస్తోంది. వాటిని విడుదల చేశాకే ఎన్నికలకు వెళ్లాలనే భావనతో ఉన్నట్లుగా సమాచారం. ఈ క్రమంలోనే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలు పంపించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఈ మేరకు వివరాలను సిద్ధం చేసిన ఆ శాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా 924 పనులకు సంబంధించి రూ.5.34కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ మేరకు మాజీ సర్పంచుల్లో కొంత ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రభుత్వానికి పంపించాం

గ్రామ పంచాయతీలకు సంబంధించి పెండింగ్ బిల్లుల వివరాలను రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వాన్ని కోరింది. దీంతో జిల్లాలోని వివరాలు పంపించాల్సిందిగా పంచాయతీ రాజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ పంచాయతీల్లో చేపట్టిన పనులు, వాటికి సంబంధించిన పెండింగ్ బిల్లుల వివరాలను ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. – జి.రమేశ్, డీపీవో

బదిలీలకు వేళాయె

- ఐకేపీ సీసీలకు స్థానచలనం
- జిల్లాలో 109 మందికి అవకాశం
- నేడు కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్



డీఆర్డీఏ కార్యాలయం

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో పనిచేస్తున్న క్లస్టర్ కోఆర్డినేటర్(సీసీ)లకు బదిలీలు జరుగనున్నాయి. దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించాలని ఆదేశిస్తూ ఆ సంస్థ సీఈవో దివ్యదేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. సెర్ప్‌లో ఎల్–1, ఎల్–2 కేటగిరీ ఉద్యోగులుగా పరిగణించే వారి బదిలీల కోసం గత నెలలో ఆప్షన్లను స్వీకరించారు. జిల్లాలో పనిచేస్తున్న 120 మంది ఆప్షన్లు ఇచ్చారు. అలాగే స్పౌజ్‌గ్రౌండ్, అనారోగ్యం, వైకల్యం, తల్లిదండ్రులు, చిన్నారుల ఆరోగ్యం వంటి అంశాలను కూడా అందులో పొందుపరిచారు. వివరాలను పరిశీలించిన సెర్ప్ అధికారులు బదిలీకి అర్హులైన వారి జాబితా సిద్ధం చేసి జిల్లాకు పంపించారు. వారికి శనివారం మధ్యాహ్నం 2.30గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన కౌన్సెలింగ్ ఉంటుందని డీఆర్డీవో రాథోడ్ రవీందర్ ప్రకటనలో తెలిపారు. అయితే వీరిని సొంత, పనిచేసే క్లస్టర్లు కాకుండా మండలంలోని ఇతర క్లస్టర్లకు బదిలీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో క్లస్టర్ పరిధిలో మూడు నుంచి ఐదు స్వయం సహాయక సంఘాలు ఉంటాయి.

11 మందికి మినహాయింపు ..

జిల్లా సెర్ప్ పరిధిలో సీసీలు, మాస్టర్ బుక్ కీపర్లు, పారాలీగల్ మండల సమాఖ్య పరిధిలోని సీసీలంతా కలిపి 109 మంది పని చేస్తున్నారు. ఇకస్వయం సహాయక సంఘాల నిర్వహణకు సంబంధించి ఆడిట్ ప్రక్రియ చేపట్టేందుకు ముగ్గురు సీబీవోలు, కమ్యూనిటీ సూపర్‌వైజర్స్ 8మంది కలిపి 11మంది జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయ కేంద్రంగా విధులు నిర్వహిస్తుంటారు. అయితే వీరికి మాత్రం బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు. మండలస్థాయిలో పనిచేస్తున్న 109 మంది సీసీలకు మాత్రమే కౌన్సెలింగ్ ద్వారా వారు ఎంచుకున్న క్లస్టర్‌కు బదిలీ చేయనున్నారు. వీరికి నాలుగేళ్లకోసారి ఈ ప్రక్రియ నిర్వహిస్తుండగా చివరి సారిగా 2018లో చేపట్టారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తొలిసారిగా కానున్నాయి.

2న ఓటర్ల తుది జాబితా

- కలెక్టర్ రాజర్షి షా
- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా రూపొందించిన ఓటర్ల తుది జాబితాను సెప్టెంబర్ 2న ప్రకటిస్తామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు– 2025 నిర్వహణపై వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. వార్డుల వారీగా పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను గురువారం ప్రకటించామన్నారు. అందులో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 30వ తేదీ వరకు ఎంపీడీవో కార్యాలయంలో తెలపాలని సూచించారు. వాటిని ఎంపీడీవోలు పరిశీలించి తగు సవరణలు చేసి తుది జాబితా సిద్ధం చేస్తారని అన్నారు. మండలస్థాయిలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్‌కలెక్టర్ యువరాజ్, ఆర్డీవో స్రవంతి, డీపీవో రమేశ్, డీఎల్‌పీవో ఫణీందర్‌రావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంకుల ప్రగతిపై కలెక్టర్ సమీక్ష

జూన్ త్రైమాసికానికి సంబంధించి డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమీక్షను కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ, నాబార్డ్ పథకాలు, వ్యవసాయం ఇతర శాఖల బ్యాంకు లక్ష్యాలపై కలెక్టర్ రాజర్షి షా సమీక్షించారు. బ్యాంకుల వారీగా సాధించిన ప్రగతి తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. గత సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాల పురోగతిపై ఆరా తీశారు. రైతులకు పంట రుణాలతో పాటు స్వయం సహాయ గ్రూపులకు ఆర్థిక చేయూత అందించి అండగా నిలవాలని సూచించారు. బ్యాంకులు స్థానిక అవసరాలు గుర్తించి, ప్రజలతో మరింత మమేకమవుతూ సేవలందించాలన్నారు. ప్రభుత్వ పథకాల అమల్లో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరికొండ: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయా గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు మెరుగు పర్చుకోవాలన్నారు. ఆయన వెంట ఇచ్చోడ సీఐ రాజు, ఎస్సై పూజ, సిబ్బంది ఉన్నారు.

సిబ్బందిని అభినందించిన ఎస్పీ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం ఎంకా గ్రామానికి చెందిన ఇప్పరి ప్రహ్లాద్– శకుంతల దంపతులు గురువారం పొలం పనులకు వెళ్లారు. భారీ వర్షం కారణంగా వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఉట్నూర్ ఎస్సై ప్రవీణ్, ఏఎస్సై రామయ్య, కానిస్టేబుళ్లు అశోక్, రమేష్, జ్ఞానేశ్వర్, జిల్లా ఫైర్ అధికారుల సహకారంతో వారిని ఒడ్డుకు చేర్చారు. సిబ్బంది కృషిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మహా గణపతికి ఎస్పీ ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని కుమార్ పేటలో శ్రీకుమార్ జనతా గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 54 అడుగుల మహా వినాయకుడికి ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఇందులో నిర్వాహకుడు తోట పరమేశ్వర్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలు నియంత్రించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

కైలాస్‌నగర్: మాతా,శిశు మరణాలు నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, వైద్యాధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. శిశు మరణాలను 15 నుంచి 10లోపు తగ్గించడాన్ని సవాలుగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. జిల్లాలో పీఎం జన్‌మాన్ మొబైల్ యూనిట్లు, జననీ వెయిటింగ్ రూమ్స్, నర్సులు–మిడ్‌వైఫ్స్‌కి ప్రత్యేక శిక్షణ వంటి కార్యక్రమాలు నిలోఫర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఎస్ఎస్‌సీయూ నోడల్ అధికారి ఆనంద్ పాల్గొన్నారు.

ఓట్ల మార్పిడి కేసులో కొత్త మలుపు

- ఇప్పటికే అరెస్టయిన ఆర్ఐ హుస్సేన్
- ఎఫ్ఐఆర్‌లో ఏ–6గా తహసీల్దార్..
- రెండు రోజులుగా అజ్ఞాతంలో సత్యనారాయణరావు

ఇచ్చోడ: ఓట్ల మార్పిడి కేసు రోజుకో కొత్త మలుపు తిరుగుతుంది. కేసులో సంబంధం ఉన్న ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులతో పాటు స్థానిక ఆర్ఐ హుస్సేన్‌ను రెండు రోజుల క్రితం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం విదితమే. ఈ క్రమంలో శుక్రవారం కేసు మరో మలుపు తిరిగింది. ఎఫ్ఐఆర్‌లో తహసీల్దార్ సత్యనారాయణరావును ఏ–6 గా చేర్చిన విషయం వెలుగులోకి వచ్చింది. కేసులో తీగ లాగితే డొంక కదులుతున్నట్లుగా కనిపిస్తుంది. కాగా, గురువారం నుంచి తహసీల్దార్ సత్యనారాయణరావు అజ్ఞాతంలోకి వెళ్లడం రెవెన్యూ వర్గాలో చర్చనీయాంశంగా మారింది.

కేసు తీరుతెన్నులు..

మండలంలోని అడేగామ(బి) మాజీ సర్పంచ్ కదం వనిత, ఆమె భర్త కదం సుభాష్ ఓట్లు గ్రామంలోని 140 పోలింగ్ బూత్‌లో ఉన్నాయి. అయితే వారి ప్రమేయం లేకుండా కొందరు నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలతో ఫోర్జరీ చేసి, రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఇచ్చోడలోని 137వ పోలింగ్ బూత్‌కు మార్చారు. ఈ విషయంపై సుభాష్ ఈనెల 20న కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని స్థానిక తహసీల్దార్ సత్యనారాయణరావును ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తమైన తహసీల్దార్ ఈ నెల 21న తిరిగి వారి పేర్లను తన లాగిన్ ద్వారా 140వ పోలింగ్ బూత్‌కు మార్చారు. విషయం బయటకు పొక్కడం, కలెక్టర్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో ఈనెల 25న తహసీల్దార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫోర్జరీ పత్రాలతో ఓట్ల మార్పిడి కోసం గోస్కుల నితిన్, కదం విశాల్ దరఖాస్తు చేశారని వారిపై చట్టా రీత్యా చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ఈ కేసులో ప్రమేయం ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆర్ఐ హుస్సేన్‌ ఏ–5గా చేర్చి బుధవారం అరెస్ట్ చేశారు. అదే రోజు ఏ–6గా తహసీల్దార్ సత్యనారాయణరావును కూడా చేర్చారు. అయితే తహసీల్దార్ పేరును మాత్రం పోలీసులు విలేకరుల సమావేశంలో ధ్రువీకరించలేదు. కాగా, గురువారం నుంచి తహసీల్దార్ అజ్ఞాతంలోకి వెళ్లారు. కేసు రోజుకో మలుపు తిరుగుతుండంతో రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై 'సాక్షి' ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతిని వివరణ కోరగా.. తహసీల్దార్ సెలవులో ఉన్నట్లుగా తనకు సమచారం లేదని పేర్కొన్నారు. అలాగే తహసీల్దార్ పేరు ఎఫ్ఐఆర్‌లో నమోదైన విషయం కూడా తన దృష్టికి రాలేదని పేర్కొనడం గమనార్హం.



ఇచ్చోడ తహసీల్దార్ కార్యాలయం

అదిరే.. సెట్టింగ్‌లు



వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీల్లో భారీ సెట్టింగులతో ఏర్పాటు చేసిన మండపాలు ఆకట్టుకుంటున్నాయి. భుక్తాపూర్‌కాలనీలో ఏర్పాటు చేసిన కేదార్‌నాథ్ ఆలయ నమూనా, నేతాజీ చౌక్‌లో తిరుమల తిరుపతి సెట్టింగ్, సరస్వతినగర్‌లో రాక్షసుని ఆకారంలో ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు భక్తులను కనువిందు చేస్తున్నాయి. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: పీఎంశ్రీ నవోదయ విద్యాలయంలో 2026–2027 విద్యాసంవత్సరంలో 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కాగజ్‌నగర్ నవోదయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు తొమ్మిదో తరగతిలో, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశాలకు సెప్టెంబర్ 23లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశాల కోసం https://cbseitms. nic. in/2025/ nvsix-9, 11వ తరగతిలో ప్రవేశాల కోసం https://cbseitms. nic. in/2025/ nvsxi-11లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కజ్జర్ల శివారులో చిరుత సంచారం



కజ్జర్ల శివారులో చిరుత పాదముద్రలు

తలమడుగు: మండలంలోని కజ్జర్ల, దేవాపూర్ శివారులో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. పంట పొలాలకు వెళ్లే రైతులకు చిరుత పాదముద్రలు కనిపించడంతో వారు పెద్దపులివిగా భావించి భయాందోళనకు గురయ్యారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ కృష్ణను సంప్రదించగా అవి చిరుతపులి అడుగులుగా గుర్తించారు. కజ్జర్ల, దేవాపూర్ శివారులో అటవీ ప్రాంతం నుంచి చిరుతపులులు వచ్చి వెళ్తున్నట్లు తెలిపారు. రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవి ఒకే చోట ఉండవని పేర్కొన్నారు. చిరుతపులి ఎవరికైనా కనిపిస్తే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వేటగాళ్ల అరెస్ట్

సాత్నాల: భోరజ్ మండలం గిమ్మ గ్రామ సమీపంలో నాటు తుపాకీతో నాలుగు నెమళ్లు, ఒక కృష్ణ జింకను వేటాడి కాల్చి చంపిన మహారాష్ట్రలోని పార్వకు చెందిన రాథోడ్ సందీప్, రాథోడ్ యోగేశ్‌ను ఫారెస్ట్ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నాటు తుపాకీ, కత్తి, వల స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్ తెలిపారు. ఎఫ్ఎస్వో హైదల్ ఖాన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సాయి, అమర్ తదితరులున్నారు.

నలుగురికి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన బోనాల రాజేశ్వర్‌కు సంబంధించిన ఆరు పందులను దొంగిలించిన నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన అల్లకుంట సంతోష్, దాండ్ల జనార్దన్, అల్లకుంట రాజేశ్, న్యూహౌసింగ్‌బోర్డుకు చెందిన రాకేశ్ ఈనెల 23న బొక్కల్‌గూడలో ఆరు పందులను దొంగిలించినట్లు పేర్కొన్నారు. వాటిని న్యూహౌసింగ్‌బోర్డులో దాచిపెట్టినట్లు తెలిపారు. మరోసారి చోరీకి యత్నించగా శుక్రవారం వారిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. విచారించగా చోరీకి పాల్పడినట్లు వారు అంగీకరించినట్లు తెలిపారు. వారి నుంచి ఐదు పందులు రికవరీ చేశారు. కాగా, వారు ఒక పందిని వధించి తిన్నట్లు సీఐ పేర్కొన్నారు.

గోదారమ్మ మహోగ్రరూపం

- బాసర గుడి సమీపానికి జలం
- మునిగిన లాడ్జీలు, దుకాణాలు
- పంట పొలాల్లో నిలిచిన నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు
- 1983 తర్వాత మరోసారి వరద



ఆలయ సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

బాసర: మూడు రోజులుగా ఏకధాటిగా కురిసిన వర్షానికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువన మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి ఎస్సారెస్పీలోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో గోదావరినది ఉప్పొంగి ప్రవహిస్తోంది. బాసరలోని హరిహర కాటేజ్‌లో జలదిగ్బంధంలో చిక్కుకున్న రెండు కుటుంబాలకు చెందిన 11 మందిని రెవెన్యూ, పోలీస్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు బయటకు తీసుకువచ్చారు. బ్రిడ్జికి 10 ఫీట్ల కింది నుంచి ప్రవహిస్తూ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. గోదావరి బ్యాక్ వాటర్‌తో పంట పొలాలు నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. గోదావరి ఘాట్లు పూర్తిగా నీట మునిగాయి. బాసర రైల్వే స్టేషన్, శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయ సమీపం వరకు నదీ జలాలు వచ్చాయి. సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. నదీ ప్రవాహంతో పలు రోడ్లు జలమయం కావడంతో బాసర నుంచి పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గోదావరి బ్యాక్ వాటర్ కారణంగా సోయా, పత్తి, వరి పంటలు నీటమునిగాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆయా కాలనీల్లో వైద్యసేవలు

భారీ వర్షాల నేపథ్యంలో బాసరలోని పలు కాలనీలు అపరిశుభ్రంగా మారాయి. వరదనీటితో ఆయా కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ముందు జాగ్రత్తగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ ఆశాలత, ఏఎన్ఎం, సిబ్బందితో ఇంటింటా తిరిగారు. విష జ్వరాలు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి సేవలందిస్తున్నారు. అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారు.



బిద్రెల్లి–టాక్లీ మధ్య ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

ఆలయంలో శాంతిపూజలు



శాంతిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

భారీ వర్షాలకు బాసర శ్రీజ్ఞాన సరస్వతీ కొలువుదీరిన క్షేత్రంలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో ఆలయ వైదిక బృందం సభ్యులు గోదావరి తల్లికి శాంతిపూజ, సౌభాగ్య ద్రవ్య సమర్పణ నిర్వహించారు. రాష్ట్రంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ, పంట నష్టం జరగకుండా రాష్ట్ర ప్రజలందరినీ క్షేమంగా కాపాడాలని ఈ సందర్భంగా అమ్మవారిని వేడుకున్నట్లు సంజీవ్ పూజారి తెలిపారు.

నిలిచిన రైళ్ల రాకపోకలు



రైల్వే ట్రాక్ పక్కన నిలిచిన నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

బాసరలో గోదావరి నదికి వరదనీరు పోటెత్తింది. గోదావరినదిపై ఉన్న రైల్వే బ్రిడ్జికి రెండు ఫీట్ల కింది నుంచే నీళ్లు ప్రవహిస్తుండడంతో ఆ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైళ్ల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు బాసర స్టేషన్ మేనేజర్ రవీందర్ తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

బాసర ఎస్బీఐలోకి చేరిన నీరు

గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ బాసర మండల కేంద్రంలోని ఎస్బీఐలోకి చేరింది. మేనేజర్ అశోక్‌కుమార్, అధికారులు అప్రమత్తమై వరద నీటిని బయటికి తీసేందుకు ప్రయత్నం చేశారు. రెండు, మూడు రోజులు సేవలకు అంతరాయం కలగవచ్చని వారు తెలిపారు. సహకరించాలని ఖాతాదారులను కోరారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

వరద ముంపునకు గురైన బాసర మండలంలోని ఓనీ, కౌటా, సావర్గం, సాలాపూర్, బిద్రెల్లి, లాబ్ది, టాక్లి గ్రామాలను ఎస్పీ జానకీ షర్మిల శుక్రవారం పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. వరద ప్రవాహం ఉన్నచోట చెరువులు, కుంటలు, వాగులు వద్దకు వెళ్లొద్దని అప్రమత్తం చేశారు. స్థానిక తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్ ఎప్పటికప్పుడు వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటిస్తూ ప్రజలకు తగిన సూచనలు చేస్తున్నారు.



బాధితులను తీసుకువస్తున్న పోలీసులు



తెప్పెలపై బాధితులతో వస్తున్న గజ ఈతగాళ్లు

'గడ్డెన్నవాగు'కు తగ్గని వరద

- ఐదు గేట్ల ద్వారా నీటి విడుదల



గేట్ల ద్వారా విడుదలవుతున్న వరదనీరు

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌లోకి శుక్రవారం భారీగా వరదనీరు చేరింది. ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు రెండు రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగుతూనే ఉంది. ఉదయం 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, రెండు, మూడు గేట్ల ద్వారా సుమారు 20 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నానికి ఇన్‌ఫ్లో మరింత పెరగడంతో మరో రెండు గేట్లు ఎత్తి 37వేల క్యూసెక్కులు దిగువకు వదిలారు. వరద గేట్లకు దిగువ ప్రాంతంలోగల గణేశ్‌నగర్ కోతి హనుమాన్ ప్రాంతంలో కుభీర్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా నీట మునిగింది. అటువైపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఆటోనగర్‌తోపాటు రాహుల్‌నగర్‌లోని డబ్బా కాలనీ, భాగ్యనగర్‌లోకి వరదనీరు చొచ్చుకువచ్చింది. దీంతో అధికారులు ముందస్తుగా ఆయా కాలనీవాసులను పునరావాస కేంద్రానికి తరలించారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఒక గేటు మూసివేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 358.20 మీటర్ల నీటిమట్టం కొనసాగిస్తూ నాలుగు గేట్ల ద్వారా 30వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

'కడెం'కు తగ్గిన వరద

కడెం: భారీ వర్షాలతో రెండురోజులుగా కడెం ప్రాజెక్ట్‌కు వరద పొటెత్తింది. శుక్రవారం ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో వరద గేట్లు మూసివేశారు. రాత్రి 6,670 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.400 అడుగుల నీటిమట్టం ఉందని వెల్లడించారు.

క్రీడాకారులే నిర్ణేతలుగా..

- చిన్న వయస్సులోనే స్టేట్ రెఫరీలుగా..
- ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఆదిలాబాద్: 19 ఏళ్ల వయస్సులో క్రీడల్లో రాష్ట్రస్థాయి వేదికల్లో పతకాలు సాధిస్తే వారి గురించి గొప్పగా చెబుతుంటాం. డిగ్రీ స్థాయిలో క్రీడల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకుని సత్తా చాటితే వారికి గొప్ప భవిష్యత్ ఉంటుందని అంచనా వేస్తాం. అయితే ఈ క్రీడాకారులు మాత్రం నైపుణ్యాలను అలవర్చుకోవడమే కాకుండా ఆ క్రీడపై పట్టు సాధించి అతి చిన్న వయస్సులోనే న్యాయ నిర్ణేతలుగా ఎంపిక కావడం విశేషం. మహబూబ్‌నగర్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వారు రిఫరీలుగా వ్యవహరించనున్నారు. టీనేజీలోనే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ రెఫరీలుగా ఎంపికైన ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులపై కథనం.

ఆల్ రౌండర్‌గా వసంత



నిర్మల్ జిల్లాలోని కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన చిక్కుడు చిన్నక్క–చిన్నయ్య దంపతుల కుమార్తె వసంత రాష్ట్రస్థాయి వేదికల్లో అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతూ రాష్ట్రస్థాయి రిఫరీగా ఎంపికైంది. ట్రిపుల్ జంప్‌లో ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలో ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్య పతకంతో మెరిసింది. ఒక స్వర్ణం, మరో కాంస్యంతో సత్తా చాటింది. షాట్ పుట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. హైజంప్‌లో రెండు కాంస్యాలతో ప్రతిభ కనబరిచింది. దాదాపు అన్ని ఈవెంట్‌లలో ఆల్ రౌండర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన డిస్ట్రిక్ట్ టెక్నికల్ అఫీషియల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించింది. మహబూబ్‌నగర్ వేదికగా ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న 11వ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎంపికైంది.

డిస్కస్ త్రోలో జ్యోతి



ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలానికి చెందిన బిస్సే సుధామ–అనసూయ దంపతుల కుమార్తె జ్యోతి ప్రస్తుతం జిల్లా కేంద్రంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. జ్యోతి డిస్కస్‌త్రోలో సత్తా చాటుతోంది. రాష్ట్రస్థాయి వేదికల్లో ఇప్పటివరకు రెండు రజత పతకాలు, ఓ కాంస్య పతకంతో సత్తా చాటింది. ఓవైపు ఓ అథ్లెట్‌గా రాణిస్తూనే అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్ వేదికగా మే 16నుంచి 30వరకు నిర్వహించిన డిస్ట్రిక్ట్ టెక్నికల్ అఫీషియల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించింది. కొద్దిరోజులుగా జిల్లాలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా స్థాయి టెక్నికల్ అఫీషియల్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఇప్పుడు మహబూబ్‌నగర్ వేదికగా ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న 11వ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎంపికైంది. కాల్ రూమ్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహించనుంది.

జంప్స్ రెఫరీగా అనిల్



ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం మంజరామ్ తండాకు చెందిన అజాడే శారదాబాయి–గురుదయాల్ సింగ్ దంపతుల కుమారుడు అనిల్ ప్రస్తుతం జిల్లా కేంద్రంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. రాష్ట్రస్థాయిలో ఇప్పటివరకు స్టీపుల్ చేజ్, హ్యామర్ త్రోలో కాంస్య పతకాలతో మెరిశాడు. ట్రిపుల్ జంప్‌లో రజత పతకంతో సత్తా చాటాడు. మేలో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన డిస్ట్రిక్ట్ టెక్నికల్ అఫీషియల్ కోర్సులో అర్హత సాధించాడు. తాజాగా మహబూబ్‌నగర్ వేదికగా నిర్వహించనున్న 11వ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్, హై జంప్, ట్రిపుల్ జంపు ఈవెంట్‌లో న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నాడు.

సద్గురు బోధనలు అనుసరణీయం

- నేడు పూలాజీ బాబా జయంతి
- భారీగా తరలిరానున్న భక్తులు



పూలాజీబాబా (ఫైల్)

జైనూర్: తన హితబోధతో ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సద్గురు పూలాజీ బాబా. మహారాష్ట్రలోని పర్భని జిల్లా, నాగ్‌నాథ్ ఔండా తాలుకాలోని బయాన్‌రావు గ్రామంలో 30 ఆగస్టు 1925లో ఆంద్ తెగలోని నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన ధోండిజి ఇంగ్లే–పుంజాబాయి పుణ్య దంపతులకు బాబా జన్మించారు. తల్లి పుంజాబాయి గొప్ప శివభక్తురాలు, భజన, సత్సంగ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. చిన్న వయస్సులోనే పూలాజీబాబా తండ్రి కరువు కాటకాల నుంచి తప్పించుకుని బతుకుదెరువు కోసం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పట్నాపూర్ ఆంద్‌గూడ గ్రామానికి 1947లో శాశ్వతంగా వలస వచ్చారు. వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగించారు. తల్లి పుంజాబాయి, గురువు గణపతి వాఘ్మరే బోధనలతో ప్రభావితమైన పంచాగ్ని యోగా సాధనతో పాటు వేదాలు, ఉపనిషత్తులు ఆధ్యాత్మిక గ్రంథాలను చదివి పూలాజీ బాబా పరమయోగిగా మారారు.

బాబా తత్వమిదే..

'అనంత విశ్వంలో మనమున్నాం. మనలో విశ్వం దాగి ఉంది. పంచభూతాల నిలయం మానవ దేహం. ఈ దేహమే దేవాలయం. శరీరంలోని కుండలి, శక్తిని ఉత్తేజితం చేయడంతో భక్త సాక్షాత్కారం లభించి ప్రశాంత జీవితం పొందగలరు' అని ఆయన బోధించారు. జీవుడే దేవుడు అంటూ భక్తుల మానసిక వికాసానికి జీవితాంతం కృషి చేసి గురుపీఠం గౌరవాన్ని పెంచిన పరమ యోగి శ్రీసిద్ధి యోగా పీఠం, సిద్దేశ్వర సంస్థాన్‌ను నెలకొల్పారు.

12 ఏళ్లు తపస్సు చేసి..

మల్లంగి తపోభూమిలో 12 ఏళ్లు బాబా తపస్సు చేశారు. మల్లంగి అరణ్య ప్రదేశం దట్టమైన వృక్షాల నడుమ ఓ నది తీర ప్రాంతంలో అల్లనేరేడు వృక్షం కింద తపస్సు చేసేవారు. ఈ క్షేత్రం నేడు సిద్దేశ్వర సంస్థాన్ మల్లంగిగా పిలువబడుతోంది. బాబా ఇక్కడే ధ్యానధారణ చేసేవారు. పూలాజీ బాబాకు 1965–66లో ఆత్మసాక్షాత్కారం అయింది.

వేడుకలకు ఇతర రాష్ట్రాల నుంచి..

జైనూర్ మండలంలోని పట్నాపూర్ శనివారం నిర్వహించనున్న పూలాజీ బాబా జయంతి వేడుకలకు తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు సిద్దేశ్వర సంస్థాన్‌కు తరలిరానున్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, కిన్వట్ ఎమ్మెల్యే భీంరావు కేరామ్ తదితరులు హాజరుకానున్నారు.

ఆత్మ విశ్వాసాన్ని నింపిన బోధనలు

బాబా బోధనలు ఎందరిలోనో ఆత్మ విశ్వాసాన్ని నింపాయి. అనేక మంది జీవితాలు ఇతరులకు ఆదర్శమయ్యాయి. బాబాను విమర్శించే వారు అతడి పాదక్రాంతులయ్యారు. బాబా భక్తులు నేటికీ అతడు చూపిన మార్గంలో జీవిస్తూ ఆయా గ్రామాల్లో ధ్యాన కేంద్రాలు నెలకొల్పారు. మూఢ నమ్మకాలకు స్వస్తి పలికి సత్ప్రవర్తనను అలవర్చుకున్నారు. పూలాజీ బాబా హితబోధతో ఎంతోమంది జీవితాలు మారాయి. నేటికీ బాబా చూపిన మార్గంలో భక్తులు మాంసాహారం, మద్యానికి దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు 16 ఏళ్ల జైలు

మంచిర్యాలక్రైం: భార్య మృతికి కారణమైన భర్తకు 16 ఏళ్ల జైలు శిక్ష, రూ.21 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి వీరయ్య శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు స్థానిక ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ రాంపూర్‌కు చెందిన గరిగంటి కుమారస్వామి సోదరి పుష్పలతకు ఐబీ తాండూర్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన సిగ్దార్ శుభ్రాత్‌తో 2019 మార్చి 16న వివాహమైంది. వారు మంచిర్యాలలోని చున్నంబట్టి వాడలోని శ్రీసాయి కాలనీలో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా పుష్పలతను అదనపు కట్నం కోసం భర్తతో పాటు కుటుంబ సభ్యులైన ఐబీ తాండూర్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన రాస్మాన్ సిగ్దార్, తులసి, అరికెళ రమేశ్, మ్యారేజ్ బ్యూరోకు చెందిన భూతం భూమయ్య, శీలం సంజీవ్ తరచూ వేధిస్తున్నారు. పలుసార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా పద్ధతి మార్చుకోకుండా శారీరకంగా, మానసికంగా హింసించారు. వేధింపులు భరించలేక మనస్తాపం చెందిన పుష్పలత పురుగుల మందు తాగి 2019 డిసెంబర్ 23న ఆత్మహత్య చేసుకుంది. భర్త శుభ్రాత్, కుటుంబ సభ్యుల వేధింపులతోనే పుష్పలత ఆత్మహత్య చేసుకుందని మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో తమ్ముడు కుమారస్వామి ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజమౌళిగౌడ్ కేసు నమోదు చేశారు. సాంకేతిక సాక్ష్యాధారాలతో నిందితులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్య శ్రీలత సాక్షులను విచారించగా, శుభ్రాత్‌పై నేరం రుజువైంది. దీంతో జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న రాస్మన్, తులసి, రమేశ్, భూమయ్య, సంజీవ్‌పై నేరం రుజువు కాలేదని తెలిపారు.

కలెక్టర్ కార్యాలయ ఉద్యోగిపై ఫిర్యాదు

రెబ్బెన: తన భార్య మిస్సింగ్‌కు కలెక్టరేట్ ఉద్యోగి కారణమని శుక్రవారం ఆమె భర్త స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అల్లూరి మమతకు ఆసిఫాబాద్‌కు చెందిన తాళ్లపెల్లి రమేశ్‌తో 24 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఈనెల 25న మమత రెబ్బెనలోని తన పుట్టింటి నుంచి వెళ్లగా ఇప్పటివరకు ఆచూకీ దొరకలేదు. దీంతో రమేశ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మమత తల్లి లీలను రమేశ్ సంప్రదించగా పొంతన లేని సమాధానం చెప్పింది. దీంతో లీలను విచారించి తన భార్యను తనకు అప్పగించి న్యాయం చేయాలని రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య మిస్సింగ్‌కు కలెక్టరేట్ ఉద్యోగి కారణమని ఆరోపించాడు. ఈ విషయమై ఎస్సై చంద్రశేఖర్‌ను సంప్రదించగా.. మమత మిస్సింగ్‌పై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే.. మమత మిస్సింగ్ కాలేదని, ఆమె క్షేమంగా ఉన్నట్లు సమాచారం ఉందన్నారు.

మృతదేహానికి రెండుసార్లు ఖననం

దిలావర్‌పూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన సాధ ఆశీర్వాదం అనే 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని 20 రోజుల వ్యవధిలో రెండుసార్లు ఖననం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాలు.. ఆశీర్వాదం 20 రోజుల క్రితం మరణించాడు. అదేరోజు క్రైస్తవ సంప్రదాయం ప్రకారం గ్రామానికి ఆనుకుని ఉన్న కాలువ పక్కనున్న వారి శ్మశాన వాటికలో ఖననం చేశారు. కాగా, నాలుగైదురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాలువలు, చెరువులు ఉప్పొంగి ప్రవహించాయి. ఆశీర్వాదం మృతదేహం ఖననం చేసిన ప్రాంతం కోతకు గురైంది. దీంతో ఆశీర్వాదం మృతదేహం వరదలో కొట్టుకువచ్చి పెద్ద చెరువు ప్రాంతానికి చేరింది. గమనించిన గ్రామస్తులు ఎస్సై రవీందర్‌కు గుర్తు తెలియని మృతదేహంగా భావించి ఫిర్యాదు చేశారు. గ్రామస్తుంతా అక్కడకు వెళ్లి పరిశీలించగా 20రోజుల క్రితం ఖననం చేసిన ఆశీర్వాదం మృతదేహంగా గుర్తించారు. దీంతో ఆ మృతదేహాన్ని వారి కుటుంబీకులకు అప్పగించగా మరోసారి ఖననం చేశారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



సతీశ్ (ఫైల్)

రామకృష్ణాపూర్: పట్టణంలోని 'ఏ' జోన్ రాంనగర్ ప్రాంతానికి చెందిన చీపురుశెట్టి సతీశ్ (40) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఏఎస్సై వెంకన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ కలహాల కారణంగా సతీశ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెంబిలో మరొకరు..

పెంబి: మానసిక స్థితి బాగా లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అందె రమేశ్ (40)కు కొంతకాలంగా మానసిక స్థితి బాగా లేదు. కుటుంబ సభ్యులు కొద్దిరోజుల క్రితం బెల్లంపల్లిలో చర్చికి తీసుకెళ్లి ప్రార్థన చేయించారు. అనంతరం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా ఎవరికీ చెప్పకుండా ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని అటవీప్రాంతంలో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య భాగ్య, ఇద్దరు కొడుకులున్నారు. పెద్ద కొడుకు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి

మంచిర్యాలటౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన కొర్రం శ్రీదేవి మంచిర్యాల మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చిన్నమాలిని కోసిని సబ్ సెంటర్‌లో కుర్రం శ్రీదేవికి ఈ నెల 27వ తేదీన ఐదో కానుపు ప్రసవం కాగా, రక్తస్రావం ఎక్కువైంది. బీపీ డౌన్ కావడంతో అక్కడే చికిత్స అందించినా పరిస్థితి విషమించింది. దీంతో అదేరోజు మంచిర్యాలలోని మాతా శిశు ఆరోగ్యకేంద్రానికి తరలించారు. బాలింతను కాపాడేందుకు ఎంసీహెచ్ వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేక ఆమె మృతి చెందినట్లు సూపరింటెండెంట్ హరీశ్చంద్రారెడ్డి తెలిపారు.

రిమ్స్‌లో మరొకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా బొందిడికి చెందిన కేంద్రె ఆకాశ్ (30) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. మద్యానికి బానిసైన ఆయన జీవితంపై విరక్తి చెంది ఈనెల 27న పురుగుల మందు తాగినట్లు పేర్కొన్నారు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వివరించారు.